# పగలే వెన్నెలా

# జగమే ఊయలా!

అవును. పగలే వెన్నెల కాస్తున్నట్లు వుంది!

జగత్తు ఊయల ఊగుతున్నట్లుగానూ వుంది!

కాదు, నేనే అటూ యిటూ ప్రక్కలకి ఉయ్యాల ఊగుతున్నట్లుగా వుంది. ఈ ఉయ్యాల ముందుకేగాని వెనక్కి ఊగదు!

బైట హోరుమని తుపాను గాలి వంటి శబ్దం.

లోపల తబలా వాయిస్తున్నటువంటి శబ్దాలు!

సూర్యుడు చందమామలా లేడు. వెండిలా కరుగుతున్నాడు. వెన్న ముద్దలా అవుపిస్తూన్నాడు! నిజం! సూర్యునికేసి మీరు సూటిగా చూడగలరా? మరి నేను చూడగలిగాను!

నేనేమైనా తపశ్శాలి ననుకొనేరు.

అబ్బే! అదేంలేదు. కనీసం బాబానైనా కాదు. మేజిక్కులసలే తెలియవు.

ఈ లోకపుమాయ అపుడపుడు మనసుని గజగజ ఒణికిస్తున్నా, చిన్నమాయతెర పీలికైనా కప్పలేను దానికి.

అవేంటవి?

సత్యాగ్రహుల్లా నిటారుగా నిలబడ్డాయి బారులు తీర్చి.

"కొట్టండి. చంపండి, నరకండి, అయినా మిమ్మల్ని మేమేం చెయ్యం. మా గుండెల్లో విషంలేదు! అమృతమే స్రవిస్తుంది! అంతే కాదు. మీకు నిలువనీడ నిస్తాం. మీ శుభ కార్యాలలో పాల్గొంటాం"

అంటున్నాయవి.

ఏంటవి?

తాటిచెట్లు!

మనం వాటి కపకారం చేసినా, అవి మనకి ఉపకారమే చేస్తాయట!

"అపకారికి ఉపకారము నెపమెన్నక సేయువాడు నేర్పరి సుమతీ" అన్నాడు. ఎవడా పిచ్చి సన్యాసి. వేమన కాదు కదా! ఎవడైనాగాని పిచ్చి సన్యాసే!

ఉపకారికి ఉపకారం చేసేవాళ్లే లేరీ మనుషుల్లో. అపకారికి ఉపకారం కూడానా? అబద్ధం. అటువంటివి జంతువుల్లో చెట్లు చేమల్లో వుంటాయి.

మదగజాల్లా ముందుకు తోసుకువస్తున్నాయి మేఘాలు.

మొరలెత్తి నాతో మాట్లాడుతున్నాయి.

తొండాలెత్తవు గదా!

"మీ తొండాలెత్తకండర్రోయ్. ఆ వర్ష ధారలకి ప్రకృతంతా తడిసిపోతే దాని అందాలెట్లా చూస్తాను?"

అవి నా మాట వినలేదు.

గుంపుగా గుమిగూడుతున్నాయి. గుసగుసలాడుతున్నాయి.

"మీ దుంప తెగ మీరిహ నామాట వినరు" అని సూర్యునికేసి చూసాను.

సూర్యుడు నా సౌంజ్ఞ గ్రహించాడు. తన కిరణాలతో వాటిని తరిమాడు.

అవి ఒక్కపరుగు. చెల్లాచెదురై పోయాయి.

నేను తనకి పని పురమాయించానని కోపగించాడేమో, తన కిరణాలతో నా కళ్ళలో గుచ్చుతాడేమో అనే సందేహంతో సూర్యుణ్ణి పరకాయించి చూశాను.

ఆదిమధ్య. రమణమ్మ

అబ్బే అదేంలేదు!

"ఏం చేస్తాం మీరు తెలివి మీరిపోయారు. మమ్మల్నే జయించేస్తున్నారు. అయినా అతి తెలివి మంచిది కాదు" అన్నాడు సూర్యుడు.

అంటే? కోపం వుందన్నమాట. వీలుగాక మనసులో దాచుకున్నాడు.

ఇకేంటవి? నీళ్ళా? అబ్బో! పెద్ద నది.

ఈ తెల్ల కాగితం ప్లేట్లో ఏంటవి? ఆ నది లోంచి ఎగిరొచ్చిన చేపలుగాని కాదుగదా!

ఛీ. ఛీ కాదు. అరటికాయ బజ్జీలు! అరవై పైసలట.

చప్పగా వున్నాయి. యింతకంటె మద్రాసు బీచ్‌లో అరవమామి వేయిస్తున్న వేడివేడి మసాలా వడలే బాగున్నాయి! బెజవాడ కనక దుర్గ కొండ క్రింద మిరపకాయ బజ్జీలే బాగు న్నాయి ఖారం ఖారంగా.

అవన్నీ పరువంలోవున్న వరిపైరులే! ఏంటో ఆ పచ్చదనం ఏదోలా అవుపిస్తోంది.

వాళ్లెవరు? కొండపల్లి బొమ్మల్లావున్నారు? కూలీలా? కర్షకులా?

అవును వాళ్లే! మనకి వాళ్ళంటే చిన్న మాపుకదూ? దరిద్రులూ దౌర్భాగ్యులూ అని.

వాళ్లు దరిద్రులా? ఛ. ఛ. కారే!

వారెంత భాగ్యవంతులో!

వారే దరిద్రులయితే ఇంత భూమాతను కష్టించి పండించి, ఎందరి కడుపులో ఎలా నింపుతారు? వారెంత భాగ్యవంతులో!

ఏ కష్టమూ పడ్డాని కిష్టం లేకుండా కుష న్స్‌లో కూర్చున్న మనమే దరిద్రులం! స్వార్థంతో కుతర్కంతో ఎవరినీ పిసరంత విదపం! రాను రాను ప్రకృతిలో బంగారు కాంతులు కరిగి కరిగి చీకట్లు అలుముకుంటున్నాయి. ఆకాశం చిన్నబోయింది. సూర్యుడు కబుర్లు చెప్పిచెప్పి, నేనూ సామాన్యుణ్ని అయిపోతు న్నానే అనే ఆవేదనతో వెళ్ళిపోయాడు.

రానురాను కారుచీకటి.

ఎంత కళ్ళు చిట్లించి చూస్తున్నా బైట ప్రపంచమేమీ కనపడ్డంలేదు.

పైగా—

నా ముఖమే నాకు కనిపిస్తోంది అద్దాల్లో.

లోపలున్న సాటిన్ తెరలు సోఫాలు అన్నీ గమ్మత్తుగా కనిపిస్తున్నాయి.

అద్దాలు కంటె నిజాలు చెప్పేదెవరు.

ఎప్పుడూ పైకి చూడాలనే మానవుని తపన. తనలోకి తను చూసుకుంటే ఎంత బాగుండును. ఈ అద్దాల్లా పక్క దృష్టిని అడ్డగించి తమలోనికి తాము చూసుకొనే జ్ఞానాన్ని ఎవరైనా కలిగిస్తే ఎంత బాగుండును!

అయినా నా ప్రయత్నం మానలేదు. ఇంకా గుచ్చి గుచ్చి చూస్తుంటే తెరల ప్రతిబింబాలు అవతలనుంచి అపుడపుడు మినుకు మినుకు మనే దీపాలు కనిపిస్తూన్నాయి. ఏవో వూళ్ళే, పట్నాలో కాబోలు.

ఆ దృశ్యం ఎలా వుందంటే—నాటక ప్రారంభం ముందు, తెర వెనుక హారతి వెలి గించి పాటలు పాడే కనిపించని నటీనటుల దృశ్యంలా వుంది.

నా వన్నీ అబద్ధాలు అనుకుంటున్నారుకదూ?

అంతే వెండి మాయ ప్రపంచంలో వున్న మీరంతకంటె వూహించలేరు.

కాని నావి నిజాలు!

కావాలంటే మీరు, ఏరైలైనా సరే ఎ. సి. కంపార్టుమెంట్‌లోకి ఎక్కి ప్రయాణించండి. నా మాటలు అబద్ధాలో నిజాలో తెలుస్తుంది.

ప్రకృతి రహస్యాలని కొల్లగొట్టి కృత్రిమ సుఖాల నమర్చుకుంటున్నాడు మానవుడు.

అవి నిజమైన సుఖాలు కావంటోంది ప్రకృతి.

ఈ రెండింటిలో ఏది నిజమో నాకు తెలి యదు సుమండీ! □